క్లుప్తంగా

ద్రవిడ వర్సిటీ విద్యార్థికి అవార్డు



తమిళనాడు ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ద్రవిడ వర్సిటీ విద్యార్థి

కుప్పం: ద్రవిడ వర్సిటీ తమిళ శాఖలో పరిశోధక విద్యార్థి సెల్వకుమార్ తమిళనాడులో ఉత్తమ వ్యాఖ్యాతగా అవార్డు అందుకున్నాడు. తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి వేడుకల్లో సెల్వకుమార్ తన ప్రసంగంతో ఆకట్టుకుని తమిళనాడు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈయనకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అవార్డును ప్రదానం చేశారు. సెల్వ కుమార్‌ను వర్సిటీ అధ్యాపక బృందం అభినందించింది.

ట్రాఫిక్ నియంత్రణకు వన్ సైడ్ పార్కింగ్



పట్టణంలో జవిళి వీధిలో వన్‌సైడ్ పార్కింగ్

పలమనేరు: పట్టణంలోని రద్దీగా ఉండే వీధుల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు వన్‌సైడ్ పార్కింగ్‌కు సోమవారం నుంచి మళ్లీ శ్రీకారం చుట్టారు. గతంలో వన్‌సైడ్ పార్కింగ్ అమలు చేసినప్పటికీ తదనంతరం ఎన్నికల తర్వాత ఇది అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో పట్టణంలోని జవిళివీధి, బజారువీధి, రంగమహల్ సర్కిల్, టీకే స్ట్రీట్, గుడియాత్తం సర్కిల్, బాలికోన్నత పాఠశాలల వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని స్థానిక పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు ఇటీవల అధికారులకు నివేదించారు. దీనిపై స్పందించిన పోలీసులు వన్‌సైడ్ పార్కింగ్‌కు పూనుకున్నారు.

క్రీడాపోటీలకు ఆరుగురి ఎంపిక



క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, పీడీ

పుంగనూరు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని మోడల్‌స్కూల్‌లో చదువుతున్న భారతి, ఎస్.మేఘన, దివ్యశ్రీ కబడ్డీకి, పుష్పలత జావెలిన్‌త్రో, సంధ్య పరుగుపందెం, ఐశ్వ ర్య త్రోబాల్‌కు ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ లోకనాథం సోమ వారం తెలిపారు. అండర్–19 గేమ్స్‌కు జిల్లా త రపున వీరంతా ఎంపికయ్యారని అభినందించా రు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట్రమణ, ధర్మేంద్ర, పద్మావతి, పద్మశ్రీ, రామచంద్ర, గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న బాగారెడ్డి, జగదీష్ తదితరులు

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు ఎంపీటీసీ మార్కొండయ్య సోదరుడు రాజన్న(45) ఆదివారం అనారోగ్యంలో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి మృతుని స్వగ్రామమైన పాలేపల్లెకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు సర్పంచ్ రవికుమార్, మాజీ ఎంపీటీసీ ప్రసాద్ రెడ్డి, జగదీష్ తదితరులు నివాళులర్పించారు.

పలమనేరు మున్సిపాలిటీకి అవార్డు

పలమనేరు: స్వనిధిసే సమృద్ధిలో భాగంగా 2023–24లో ఉత్తమ ప్రగతి సాధించినందుకు పలమనేరుకు బెస్ట్ మున్సిపాలిటీ అవార్డు వచ్చిందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించనున్నట్టు తెలియజేశారు.

నేడు మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సమావేశంలో పట్టణంలోని సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు జాబ్‌మేళా

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద ఉన్న మైనార్టీల ఐటీఐ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి , స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల భర్తీకి దీనిని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు సెల్ నంబరు:7780599208 ను సంప్రదించాలన్నారు.

కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు కుంకీ ఏనుగులు ఎప్పుడొస్తాయోగానీ ఇప్పుడు అడవిలోని మదపుటేనుగుల మేటింగ్ సీజన్ మొదలు కావడంతో వీటితో జనానికి ముప్పు తప్పేలా లేదు. ఈ నాలుగు నెలలు మదపుటేనుగులు మదమెక్కి విపరీతంగా ప్రవర్తిస్తూంటాయి. సాటి ఏనుగులే కాదు కనిపించే జంతువులు, ప్రజలపై దాడులు చేస్తుంటాయి. మేటింగ్ సీజన్‌లో కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని దాటి బయటకొచ్చే మదపుటేనుగుల బారిన పడి ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారు. ఆడ ఏనుగులకంటే మదపుటేనుగుల దాడుల్లోనే ఎక్కువమంది ప్రజల ప్రాణాలు పోతున్నాయి.

మద గజగజ.. ప్రజలు గిజగిజ

కౌండిన్యలో మొత్తం ఏనుగులు	:	100కి పైగా
ఇప్పటి వరకూ ఏనుగుల దాడిలో మృతి చెందినవారు	:	14
గాయపడినవారు	:	30
ఇప్పటిదాకా మృతి చెందిన ఏనుగులు	:	19

- అక్టోబర్ నుంచి జనవరి వరకూ కలయిక కోసం మగ ఏనుగులు తహతహ
- ఈ నాలుగునెలలు మదపుటేనుగులకు మేటింగ్ సీజన్
- ఈ సమయంలో శృంగారకేళి కోసం విపరీత ప్రవర్తన
- జనంపైకి తిరగబడేది ఎక్కువగా మదపుటేనుగులే



కాలువపల్లె వద్ద గుడియాత్తం రోడ్డు దాటుతున్న మదుపుటేనుగులు(ఫైల్)

పలమనేరు: పలమనేరు, కుప్పం, చిత్తూరు ఫారెస్ట్‌రేంజిల పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలోని ఏనుగులతోపాటు అటు తమిళనాడులోని మోర్ధన ప్రాంతం, క్రిష్ణగిరి, కావేరిపట్నం , కర్ణాటకలోని హొసూర్, బన్నేర్‌గట్టల నుంచి తరచుగా కౌండిన్యలోకి ప్రవేశించే ఏనుగులున్నాయి. స్థానికంగా ఉన్న గుంపుల్లో మొత్తం 12 మగ ఏనుగులుండేవి. వీటిలో ఆరు మృతిచెందగా ఇప్పుడు ఆరు మగ ఏనుగులు(మదపుటేనుగులు) మాత్రం ఉన్నాయి. గుంపు నుంచి దూరంగా ఉండి ఒంటరిగా సంచరిస్తున్నాయి. ఒక్కో మదపుటేనుగు ఎంపిక చేసుకున్న ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుంది. ఇవి చాలా క్రూరంగా ప్రవర్తిస్తుంటాయి. జనం కనిపిస్తే వారిపైకి దాడులు చేయడం, లేదా తరమడం చేస్తుంటాయి. వీటి చేష్టలు, గుర్తులను బట్టి స్థానికంగా వాటికి పేర్లు పెట్టి పిలుస్తుంటారు. ఈ ప్రాంతంలో రౌడీ ఏనుగు, రాముడు, భీముడు, ఒంటి దంతం ఏనుగు, ఒంటి కన్ను ఏనుగు.. ఇలా వీటికి పేర్లు పెట్టారు. ఇవి తమ ఉనికికోసం ఎప్పుడూ రౌడీల్లా ప్రవర్తించం వాటి నైజం. మిగిలిన ఆడ ఏనుగులు, దున్నలు భయమెక్కువ. దీంతో ఇవి గుంపులోనే ఉంటూ జనాన్ని చూసి వెనక్కు వెళుతుంటాయి.

ప్రస్తుతం సంచరిస్తున్న మదపుటేనుగులు ఆరు మాత్రమే

కౌండిన్యలోని 12 మదపుటేనుగుల్లో ప్రస్తుతం ఆరు మాత్రమే ఉన్నాయి. బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లిలో రౌడీ ఏనుగుగా చెప్పుకునే మదపుటేనుగు కరెంటు తీగలకు బలైంది. గంగవరం మండలం మన్నారునాయనిపల్లి సమీపంలో రైతు పొలానికి రక్షణగా ఏర్పాటు చేసిన కరెంటుకు మరో మదపుటేనుగు బలైంది. అంతకుముందు కాలువపల్లె, ముసలిమొడుగుల వద్ద రాముడు, భీముడు అనే రెండు మదపుటేనుగులు చనిపోయాయి. రెండేళ్ల క్రితం పలమనేరు మండలంలోని బేరుపల్లె, గాంధీనగర్‌ల వద్ద రెండు మదపుటేనుగులు కరెంట్ షాక్‌కు గురై చనిపోయాయి. ఇవి బతికున్నప్పుడు మనుషులు, పశువులు, కుక్కలను తరమి తరిమి చంపేవి. ఇప్పుడున్న ఆరు మదపుటేనుగుల్లో గుడ్డి కన్ను ఏనుగు గత మేటింగ్ సీజన్‌లో యాదమరి మండలం దిగువకణతల చెరువు వద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్‌ను చంపిన విషయం తెలిసిందే. ముసలిమొడుగు రౌడీగా పిలవబడే మరో ఏనుగు కౌండిన్యలోని వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేసి ఆపై ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసిరేసింది. ఊసరపెంట మదపుటేనుగు తరచూ ఆ గ్రామంలోకి వచ్చి రాత్రంతా ఉండి వెళ్లడం దీని ప్రత్యేకత. మిగిలిన రెండు మదపుటేనుగులు వేర్వేరుగా కౌండిన్యలో సంబంధిత ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి.



పాదముద్రల ఆధారంగా మదపుటేనుగుల జాడను కనిపెడుతున్న అటవీశాఖ సిబ్బంది



అడవిలో ఏనుగుల జాడను పసిగట్టే ఎలిఫెంట్ ట్రాకర్స్

ఈ నాలుగునెలలు మదం పట్టి ఉంటాయి

ముఖ్యంగా మదపుటేనుగులు అక్టోబర్ నుంచి జనవరి వరకూ ఆడ ఏనుగులతో జత కట్టేందుకు మత్తులో ఉంటాయట(మేటింగ్ సీజన్). తన పరిధితోపాటు అడవిలో ఆడ ఏనుగుల కోసం చాలాదూరం అన్వేషిస్తుంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సమయంలో మనుషులు, జంతువులపై అవి దాడులు చేస్తుంటాయి. జత కట్టదలచిన ఆడ ఏనుగులు వీటి దారికి రాకపోవడం లేదా అక్కడ జరిగే మదోత్సాహంలో ఇప్పటిదాకా ఆరు ఆడ ఏనుగులు మృతిచెందాయి. ఈ నాలుగు నెలలు మదపుటేనుగుల కారణంగా ప్రమాదాలు పొంచి ఉండడంతో అడవుల్లోకి ఎవరూ వెళ్లరాదని స్థానిక ఫారెస్ట్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కల్లూరు(పులిచెర్ల): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమ వారం న్యాయవాది సలీం, కోర్టు సిబ్బంది పరిశీలించారు. వారు మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాల మేరకు తాము ప్రభుత్వ స్కూళ్లలో మధ్యా హ్న భోజనం తీరుతెన్నులు ఎలా ఉందో పరిశీలిస్తున్నట్టు చెప్పారు. నాణ్యతాప్రమాణాలతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూ ఉండాలన్నారు. రోజువారీ ఇస్తున్న చిక్కీలు, కోడిగుడ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెంకటసిద్ధులు, రాజేంద్ర, రాజశేఖర్, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కోర్టు సిబ్బంది

శివాడిలో 'ఫ్యామిలీ డాక్టర్'

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లిఖిత రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇళ్ల పరిసరాలో మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ జమున, ఏఎన్ఎం సుశీల, ఆశావర్కర్లు ఉమ, చాంద్‌బీ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లిఖిత

సుడిదోమతో వరి పంటకు నష్టం

పుంగనూరు: వరిపంటను సుడిదోమ ఆశించి నష్టం కలిగిస్తోందని, దీనిని నివారణ తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ రైతులకు సూచించారు. సోమవారం ఆమె మండలంలోని అమ్మిగానిపల్లెలో సుడిదోమ వల్ల నష్టపోయిన రామయ్యకు చెందిన వరిపంటను పరిశీలించి మాట్లాడారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండటంతో పాటు అధిక వర్షాల మూలాన ఈ దోమ వ్యాప్తి చెందుతుందన్నారు. నివారించేందుకు నీటిని తొలగించి, నత్రజని ఎరువులను వినియోగించాలన్నారు. అలాగే ఈ సమయంలో వరిపంటను వేసే వారు చైతన్య, కృష్ణవేణి, విజేత వంటి రకాలను మాత్రమే వేసుకోవాలన్నారు. పొలాన్ని తరచూ ఆరబెట్టాలని సూచించారు. పంట తొలిదశలో అసిఫేట్, ఇథఫెన్ ప్రాక్స్ మందులను వ్యవసాయాధికారుల సలహా మేరకు వినియోగించాలన్నారు. సుడిదోమ ఎక్కువైనప్పుడు బ్యూప్రోఫిజన్ లేదా ఫైనేట్రోజైన్‌ను వినియోగించి పంటపై పిచికారీ చేయాలని సూచించారు.



వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ జ్యోతమ్మ

కౌండిన్య నదిపై ఏటిగడ్డ గ్రామానికి వంతెన నిర్మించరూ!

●జిల్లా అధికారులకు గ్రామస్తుల ని'వేదన'

పలమనేరు: కౌండిన్య నదిని దాటివెళ్లే తమ గ్రామానికి వంతెన నిర్మించాలని మండలంలోని ముసలిమొడుగు, ఏటిగడ్డ గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పందనలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నదిలో నీరున్నప్పుడు గ్రామానికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టుకుని క్రిష్టాపురం మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. ముసలిమొడుగు గ్రామ రైతులు నదిని దాటి వ్యవసాయం చేస్తున్నారని, వ్యవసాయోత్పత్తులను గ్రామానికి తీసుకెళ్లలేని పరిస్థితి ఉందని సమస్యలు ఏకరువు పెట్టారు. యానాదులు ఎక్కువగా నివసించే తమ గ్రామానికి వంతెన కావాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే కౌండిన్య నదీ ప్రవాహానికి పొలాలు కోతకు గురవుతున్నాయని, ఈ పరిస్థితి రాకుండా నదికి ఇరువైపులా సిమెంట్ గోడ లాంటిది కట్టాలని రైతుసంఘ నాయకుడు ఉమాపతి నాయుడు కోరారు. మరోవైపు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో పట్టణంలోని హిందూ శ్మశానవాటిక ఆక్రమణలు తొలగించాలని పట్టణానికి చెందిన తాతయ్య నాయుడు ఆర్డీఓ భవానికి విన్నవించారు.



జిల్లా కేంద్రంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు



మంచుతున్న మంచు

మండలంలో ఒక్క సారిగా మంచు తీవ్రత పెరిగిపోయింది. సోమవారం తెల్లవారిజామున 4 నుంచి ఉదయం 9గంటల వరకూ దట్టంగా కురిసిన పొగ మంచు కారణంగా యాభై మీటర్ల లోపు ఉన్న భవనాలు, వాహనాలు కూడా కనిపించలేదు. దీంతో జాతీయ రహదారిలో వాహనాలు ఉదయం పూట కూడా లైట్లు వేసుకుని నెమ్మదిగా ముందుకు సాగాయి. అమాంతం పెరిగిన పొగమంచు కారణంగా పంటల్లో చీడ, పురుగుల ఉధృతి పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలలో పొగ మంచు ఎక్కువగా కురుస్తుంది. కానీ ఈఏడాది అక్టోబర్ చివర్లోనే మంచు తీవ్రత పెరగడంతో ఇక రానున్న రోజుల్లో మంచు దెబ్బ ఎలా ఉంటుందో అని జనం చర్చించుకుంటున్నారు. – శాంతిపురం

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

గుడుపల్లి: రైతులు తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించుకునేందుకు డ్రిప్‌లు, స్ప్రింక్లర్లను రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో వచ్చే రబీ సీజన్‌కే నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. దీంతో రైతులు ముందు జాగ్రత్తగా డ్రిప్‌లు, స్ప్రింక్లర్లకు తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకుని రాయితీపై పొందాలని కోరారు. 5 ఎకరాలు లోపు ఉన్న చిన్న సన్నకారు రైతులకు డ్రిప్ పరికరాలకు 90 శాతం రాయితీ (రూ.2.18 లక్షలు), స్ప్రింక్లర్లకు 55 శాతం రాయితీ, 5 నుంచి 10 ఎకరాలు ఉన్న రైతులకు రూ.3.36 లక్షల రాయితీ (70శాతం) ఇస్తామన్నారు. రాయితీ పొందిన రైతులు ఏడేళ్లు పూర్తయిన తర్వాత మరల దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయం సంప్రదించాలన్నారు.

తీరిన తాగునీటి సమస్య

కుప్పం రూరల్: కుప్పం మండలం, పైపాళ్యం బీసీ కాలనీలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. గత బుధవారం మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కిన విషయం విదితమే. దీనిపై స్పందించిన కుప్పం ఎంపీడీఓ సాయి లహరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదివారం రాత్రి గ్రామంలో మరో బోర్ డ్రిల్ చేశారు. 750 అడుగుల వద్ద నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంగళ, బుధవారాల్లో మోటారు బిగించి పైపాళ్యం బీసీ కాలనీ వాసులకు నిరంతరంగా నీటి సరఫరా చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

నియామకం



హరిప్రసాద్

రొంపిచెర్ల: చర్మకార సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని గానుగచింతకు చెందిన హరిప్రసాద్‌ను నియమిస్తూ ఆ సంఘ అధ్యక్షుడు బుల్లా రాజారావు సోమవారం నియామకపత్రం జారీ చేశారు. మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో 2024 అక్టోబర్ నుంచి 2026 డిసెంబర్ వరకు ఈ పదవిలో హరిప్రసాద్ కొనసాగవచ్చని ఆ పత్రంలో పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం చెరువు కట్టపై ఉన్న శ్రీభైరవేశ్వరస్వామి పురాతన ఆలయ పునఃనిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయాని గ్రామస్తులు, ఆయకట్టు రైతులు కోరారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయం చుట్టు పక్కల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

మోటార్ సైకిల్ ఢీ వృద్ధుడికి గాయాలు

సదుం: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు గాయపడ్డ సంఘటన మండలంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం..కొర్లకుంటవారిపల్లెకు చెందిన నరసింహులు (75) తిమ్మానాయనపల్లె రోడ్డు క్రాస్ నుంచి స్వగ్రామానికి నడచి వెళ్తుండగా ద్విచక్రవాహనం అతడిని ఢీకొనడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. సదుం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో పీలేరుకు తరలించారు.

దళితుడి భూమిని అగ్రవర్ణాల ఆక్రమణ

రొంపిచెర్ల: దళితుడు శ్రీనివాసులుకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు సోమవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గాజులపల్లెకు చెందిన శ్రీనివాసులుకు 1146–లో 2.35 ఎకరాల డీకేటీ భూమి ఉందని, దీనికి రెవెన్యూ అధికారులు చాలాకాలం క్రితమే వన్-బీ, అండగల్, టైటిల్‌డీడ్ పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారన్నారు. అయితే కొందరు అగ్రవర్ణాల వారు అతడి భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని, దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. బాధితుడితోపాటు దళిత పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య,సీపీఐ నేతలు పి.కవిత, రఘు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

–కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. సోమవారం కడా కార్యాలయ ప్రాంగణంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయన మాట్లాడారు. ఫిర్యాదులను శాఖల వారీగా బదలాయించి పరిష్కరిస్తామని, నియోజకవర్గంలో రెవెన్యూ శాఖపరంగా ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రీ-సర్వే సమస్యలైతే గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని, అందరూ కలసి కట్టుగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముందకుసాగాలని పిలుపునిచ్చారు. ఫిర్యాదులను విభజించి శాఖల వారిగా అధికారులు పంపి సరిష్కారాలకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

పోలీస్ బందోబస్తుతో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ



హాజరైన సభ్యులు, అధికారులు

కల్లూరు(పులిచెర్ల): పులిచెర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం పోలీస్ బందోబస్తు తో నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ, అధికారులు చేప ట్టే ప్రతి అభివృద్ధి పనుల సమాచారాన్ని సభ్యులకు తెలియజేయాలన్నారు. శాఖల వారీగా అజెండాలో ని అన్ని అంశాలను ఆమోదించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి మండలంలో ప్రతి మారుమూల గ్రామానికి రోడ్డు సౌకర్యం, తాగు నీటివసతి కల్పించి అభివృద్ధి చేసా రన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాన్ని మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు శ్రేయస్కరం

బైరెడ్డిపల్లె: గర్భవతులు ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు చేసుకోవడం శ్రేయస్కరమని తీర్థం వైద్యాధికారిణి పద్మావతి అన్నారు. తీర్థం పీహెచ్‌సీలో సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యాధికారుల సలహాలను పాటిస్తూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు చేయడానికి 24 గంటల పాటు వైద్యాధికారులు అందుబాటులో ఉంటారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాన్పులు చేస్తున్నట్టు చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోరాదని హితవు పలికారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సునంద, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో కాన్పులు చేస్తున్న వైద్యాధికారి పద్మావతి

దొంగ అరెస్ట్ : చోరీ సొత్తు స్వాధీనం

బైరెడ్డిపల్లె : మండలకేంద్రంలోని ఆచార్యవీధిలో నివాసం ఉంటున్న ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితున్ని అరెస్టు చేసినట్లు సీఐ మురళీమోహన్ మీడియాకు వెల్లడించారు. వివరాలు.. ఈనెల 20న వీరభద్ర ఇంట్లో రూ.1.80 లక్షలు నగదు, కాళ్ల పట్టీలు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సోమవారం దేవదొడ్డి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న బైరెడ్డిపల్లె సుబ్రమణ్యం కుమారుడు పి.పాండురంగను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుంచి రూ.1.80 లక్షల నగదు, కాళ్ల పట్టీలను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు. దాడుల్లో ఎస్ఐ పరుషురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మురళీమోహన్

4న మాదిగల సదస్సు విజయవంతం చేయండి

శాంతిపురం: నవంబర్ 4న తిరుపతిలో నిర్వహించనున్న మాదిగ కులస్తుల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం స్థానిక మండల సచివాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు సమావేశమై సదస్సు గురించి చర్చించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం కొలమడుగు పంచాయతీలోని రామాపురాన్ని సందర్శించి విమానాశ్రయ బాధితులతో మాట్లాడారు. కుప్పం ఎయిర్‌పోర్ట్ కోసం భూ సేకరణతో మాదిగ రైతులు కూడా తీవ్రంగా నష్టపోతుండటంతో ఈ సమస్యను మంద కృష్ణమాదిగ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్ మాదిగ, మండల అధ్యక్షుడు రవీంద్రమాదిగ, వెంకటేష్ మాదిగ, పాపన్న, నారాయణమాదిగ తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయ బాధితులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు